## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-04-1987, పాలకోడేరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనకు ధనం ఉన్నప్పటికీ, చదువు ఉన్నప్పటికీ, అధికారం ఉన్నప్పటికీ మనకు దుఃఖం వస్తోంది, భయం వస్తోంది. ఇది ఎవరయినా కాదంటారా? దేవుడు ఉన్నాడని చెప్పేవాళ్ళకి భయం వస్తోంది, దుఃఖం వస్తోంది. దేవుడు లేడని చెప్పేవాళ్ళకి భయం వస్తోంది, దుఃఖం వస్తోంది మనం ఎవరైనా దుఃఖంలోనుండి బయటపడ్డామా? భయంలో నుండి బయటపడ్డామా? చిన్నతనంలోనుండి ఇవి మనలను తరుముకొని వస్తున్నాయి. అందరికీ దుఃఖం ఉంది, భయం ఉంది అనకండి. మాకు దుఃఖం లేదు అని మీలో ఎవరయినా అనవచ్చు. అటువంటి మాటలు నమ్మవద్దు. తాత్కాలికంగా మీకు దుఃఖం లేకపోవచ్చు. లోపల మీలో ఎంతకాలం అయితే అజ్ఞానం ఉందో, ఎంతకాలం అయితే అవిద్య ఉందో తాత్కాలికంగా ఇప్పుడు దుఃఖం లేకపోయినప్పటికీ మీలో అజ్ఞానం, అవిద్య ఉన్నంతకాలం దుఃఖం, భయం తరువాత వచ్చేస్తాయి. భయాన్ని తొలగించు, దుఃఖాన్ని తొలగించు, నాకు ఐశ్వర్యాన్ని ఇయ్యి అని మనం భగవంతుడిని అడుగుతాము కాని నాలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించు అని మనం భగవంతుడిని అడగటంలేదు. అసలు మనం భగవంతుడిని ఏది అడగాలో ఇంతవరకు మనం నేర్చుకోలేదు, భగవంతుడిని ఏది అడగాలో మనకు తెలియటంలేదు.

మనందరికీ కోరికలు వస్తున్నాయి, ఆ కోరికలను నిగ్రహించు కోవటానికి మనం ప్రయత్నం చేస్తున్నాము కానీ అసలు కోరికలు ఎందుకు వస్తున్నాయి అని అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయటంలేదు. భగవద్గీత చదువుతున్నాము, భగవాన్ చెప్పిన మాటలు చదువుతున్నాము, ఇంకా అనేక విషయాలు చదువుతున్నాము, వాటిని అర్థం చేసుకొంటున్నాము కానీ నా కోరిక నాకు అర్థమవ్వటంలేదు. రమణస్వామి చెప్పిన మాటలు మీకు అర్థమవుతున్నాయి. మీ మనస్సు మీకు అర్థమయ్యిందా? నాకు ఎంతో చదువు ఉంది, నా మనస్సు నాకు అర్థమవ్వటం లేదు. ఇంక ఆ చదువు వల్ల ప్రయోజనం ఏమిటి? అర్థంచేసుకునే శక్తి ఉండాలి కదా, మీ మనస్సును అర్థం చేసుకోవటానికి ఎప్పుడైనా ప్రయత్నం చేస్తున్నారా? మనం రూపానికి పరిమితమై ఉన్నాము, నామానికి పరిమితమై ఉన్నాము. మరణించేటప్పుడు కూడా ఈ నామరూపాలను స్మరిస్తూనే మరణిస్తాము. మరణం ఎవరికి అంటే ఈ దేహానికే మరణం, ఆత్మకు మరణం లేదు. దేహం అశాశ్వతమైనది, ఆత్మ

శాశ్వతమైనది. దేహం అసత్యం, ఆత్మ సత్యం. దానిని తీసుకొనివచ్చి దీనికి ముడిపెడుతున్నాము, దేహమే ఆత్మ అనుకొంటున్నాము. అందుచేత మనకు మోహం కలుగుతోంది. శరీరం పుట్టినప్పుడు మనం పుట్టాము, శరీరం మరణించినప్పుడు మనం మరణిస్తున్నాము అనుకొంటున్నాము. అందుచేతనే మనకు మోహం కలుగుతోంది. ఆత్మను అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి. రాత్రి మనకు అనేక కలలు వస్తాయి. ఆ కల నిజమా, మెలకువ నిజమా. మీరందరు కైలాసానికి వెళదామని, స్వర్గానికి వెళదామని ప్రయత్నం చేస్తున్నారు కానీ ఆత్మను తెలుసుకోవటానికి ప్రయత్నం చేయటంలేదు. మీరు పుణ్యకార్యాలు చేసి స్వర్గానికి వెళ్ళవచ్చు అది కూడా స్వప్నమే, మీరు కైలాసానికి వెళ్ళవచ్చు అది కూడా స్వప్నమే, ఈ శరీరాన్ని విడిచిపెట్టి మరొక శరీరంలోనికి ప్రవేశించవచ్చు, అది కూడా స్వప్నమే. మీరు ఎక్కడికి వెళ్ళినా అది స్వప్నమే. ఆత్మను తెలుసుకొన్నప్పుడు మాత్రమే మీకు మెలకువ వస్తుంది, అదే నిజమైన మెలకువ. అప్పడే మనం నిజంగా జీవించినట్లు. ఆరోజు కోసం మనం చూడాలి.

నాకు అది కావాలి, ఇది కావాలి అని చాలామంది భగవంతుడిని బలవంతం చేస్తారు. ఏ విషయం గురించి మీరు భగవంతుడిని బలవంతం పెట్టకండి. భగవంతుడి అనుగ్రహం కోసం ఎదురుచూడండి. భగవంతుడిని మీరు ఏమీ అడగవద్దు. మీరు అడగకపోయినా ఆయన ఇస్తాడు అందుచేత అడగవద్దు. నాకు అది కావాలి, ఇది కావాలి అని అడగటం కోసం మీ కాలాన్ని, మీ శక్తిని ఖర్చు పెట్టవద్దు. భక్తి మంచిదే కానీ కారణభక్తి మంచిది కాదు. అకారణ భక్తి ఉండాలి. మీకు భక్తి ఉండాలి కాని దానికి కారణం కనబడకూడదు. కారణం కనిపించింది అనుకోండి అది నిజమైన భక్తి కాదు, సత్యమైన భక్తి కాదు. అకారణభక్తి మనలను ఆత్మ దగ్గరకు తీసుకొనిపోతుంది. ఆత్మను తెలుసుకొనేవరకు మనం దుఃఖంలోనుండి, భయంలోనుండి, మోహంలోనుండి, సంసారంలోనుండి బయటపడలేము. మనం అందరం సంసారంలో ఉన్నాము కదా. ఈ సంసారం అనేది ఒక చెట్టు. ఈ సంసారం అనే చెట్టుకు విత్తనం ఏమిటి అని ఆచార్యులు వారు అడిగి దానికి ఆయనే సమాధానం చెప్పారు. సంసారం అనే చెట్టుకు విత్తనం పాపం అని చెప్పారు. అంటే పాపం అనే విత్తనంలో నుండి ఈ సంసారం అనే చెట్టు వచ్చింది. ఈ పాపం పోతే ఆ చెట్టు కూడా నశిస్తుంది. ఇప్పడు నేను సంసారం అనే బావిలో పడ్డాను. అందుచేత ఓ లక్ష్మినరసింహస్వామీ! నీ చెయ్యి నాకు అందించి ఈ సంసారం అనే బావిలోనుండి నన్ను బయటకు లాగు, ఇదీ నీ ప్రార్థన అంటున్నారు ఆచార్యులవారు. నా ప్రార్థన నువ్వు స్వీకరించి

నన్ను రక్షించు అంటున్నారు. ప్రార్థన అనేది ఇలా ఉండాలి. ఇటువంటి ప్రార్థనలు మనం చేస్తున్నామా? భక్తిని ఎంత రహస్యంగా ఉంచుకుంటే అంతమంచిది, వెల్లడి చేయకూడదు అన్నారు భగవాన్. మీ ఇంట్లో ఎంత బంగారం ఉందో మీరు ఎవరికైనా చెపుతారా? మీ ఇంట్లో బంగారం ఎంత ఉంది? డబ్బు ఎంత ఉంది? అంటే ఎవ్వరూ చెప్పరు కానీ భక్తి విషయం వచ్చేటప్పటికి చెపుతారు. మేము ఎన్నో పుణ్యకార్యాలు చేసాము, గుడులు కట్టించాము, గోపురాలు కట్టించాము, రేవులు కట్టించాము అని ఇలా ఎన్నో చెపుతారు. అది పనికిరాదు. అలా చెప్పకుంటూ పోతే అహంకారం పెరుగుతుంది. అహంకారం పెరిగే పనులు చెయ్యవద్దు. అలా ప్రచారం చేసుకోవద్దు. నిజానికి ప్రచారం అక్కరలేదు. అబద్ధానికి ప్రచారం కావాలి.

మీ ఇంట్లో ఉన్న బంగారం పెట్టి మీరు వస్తువులు చేయించుకోగలరు కానీ మీ ఇంట్లో ఉన్న బంగారం పెట్టి మీ మనస్సును బంగారం చేసుకోగలరా? అది సాధ్యం కాదు. కానీ మీ మనస్సును బంగారం చేసుకోండి అని ఇక్కడ రమణాచార్యులు చెపుతున్నారు. మన మనస్సును బంగారం చేసుకోవటం ఎలాగ? విషయచింతనను విడిచిపెట్టి సతతము ఆత్మచింతనను ఎవడైతే చేస్తున్నాడో వాడి మనస్సు బంగారం అవుతుంది. శారీరక ప్రవర్తన, మానసిక ప్రవర్తన ఎవడికైతే శుచిగా ఉందో, ఎవడికైతే శీలం ఉందో వాడే యోగి అని పరమాత్మ చెప్పాడు. మీరు ఏమీ పెద్దగా కష్టపడొద్దు. మీ మనస్సును సమానంగా ఉంచుకోండి. మీ మనస్సులో హెచ్చుతగ్గులు లేకుండా చూసుకుంటే మనస్సులో ఉన్న లోపాలు రాలిపోతాయి. రాగం అనేది ఒక మంట, ద్వేషం అనేది ఒక మంట, ఇష్టం అనేది ఒక మంట, అయిష్టం అనేది ఒక మంట. ప్రతీమనిషి ఈ మంటలో కాలిపోతున్నాడు. పైకి శాంతిగా ఉన్నట్లు కనిపిస్తున్నాడు కాని అది నిజం కాదు. ప్రతీ మనిషి నిజంగా శాంతిలో ఉంటే లోకం ఇంత అశాంతిగా ఎందుకు ఉంది. మనిషి శాంతిగా ఉంటే కుటుంబంలో శాంతి ఉంటుంది. కుటుంబం శాంతిగా ఉంటే గ్రామంలో శాంతి ఉంటుంది. గ్రామాలు శాంతిగా ఉంటే లోకంలో శాంతి ఉంటుంది. మనిషి హృదయంలో ఎంతకాలం అయితే శాంతి లేదో అంతకాలం లోకంలో ఎక్కడా శాంతి కనబడదు. నా హృదయంలో శాంతి లేనప్పడు లోకంలో శాంతి దొరుకుతుందని ఆశించటం న్యాయం కాదు. నా హృదయంలో లేనిది లోకంలో కనబడదు. ద్వేషం అనేది ఎలా ఉంటుందో మీకు తెలియదు అనుకోండి, ఇంక లోకంలో మీకు ద్వేషం కనబడదు. మీ హృదయంలో లేనిది ఏదీ మీకు ప్రకృతిలో కనబడదు.

మనస్సును నిగ్రహం చేసుకోవటానికి నిరంతరం ప్రయత్నం చెయ్యాలి. ముందు మనస్సును అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేస్తే తరువాత నిగ్రహం దానంతట అదే వస్తుంది. ఎక్కువగా జనాలతో తిరగవద్దు. సాధ్యమైనంత వరకు ఏకాంతవాసంలో ఉండు. రోజూ కొంత టైము కేటాయించుకొని ఏకాంతంగా ఉండి సాధన చెయ్యండి. నిరంతరం జనంలో కూర్చుంటే అనవసరమైన సంభాషణ వచ్చి మన నెత్తిమీద పడుతుంది. ధ్యానం చేసేటప్పుడు ఒక్కడినే చెయ్యమన్నారు, స్టడీ చేసేటప్పుడు ఇద్దరిని కలిపి చెయ్యమన్నారు. ఏకాకిగా ఉండు అంటే ఎవరి సహాయం అక్కరలేకుండా నువ్వు ఉండగలగాలి. సంఘదోషం లేకుండా ఉండు. ఆశ పనికిరాదు. ఆశ అజ్ఞానానికి గుర్తు. ఒక మనిషికి ఆశ కలుగుతూ ఉంటే, వాంఛ కలుగుతూ ఉంటే వాడు అజ్ఞానంలో ఉన్నట్లు గుర్తు. పరిగ్రహం పనికిరాదు. నిరంతరం ఏదో ఒకటి స్వీకరిస్తూ ఉంటే దాని వలన కూడా నీ మనస్సులో ఉన్న శుద్ధి పోతుంది. నీ మనస్సును బాగు చేసుకోవాలి అనుకొంటే, నీ మనస్సును పవిత్రం చేసుకోవాలి అనుకొంటే ప్రకృతిలో ఉన్న వస్తువుల్ని చూసి ఆశపడకు. నీకు అవసరమైన వస్తువును పుచ్చుకో. నీ దేహాన్ని నియమించుకో. నీ మనస్సును నియమించుకో. నీ మనస్సును బాగుచేసుకోవటానికే, నీ మనస్సును పవిత్రం చేసుకోవటానికే పూజ, జపం, ధ్యానం ఇవి అన్నీ ఏర్పాటు చేసారు. నీ మనస్సును బాగుచేసుకోవటానికి ఇవి ఉపయోగపడకపోతే ఈ పూజ, జపం, ధ్యానం వల్ల ప్రయోజనం ఏమిటి? మనల్ని మనం తెలుసుకోవటానికి మనం చేత్తో చేసే పూజ కంటే నోటితో చేసే జపం, నోటితో చేసే జపం కంటే మనస్సుతో చేసే ధ్యానం ఎక్కువ ఉపయోగపడతాయి. అంటే నన్ను నేను తెలుసుకోవటానికి ఇవి మూడు ఉపయోగ పడతాయి. ఇవన్నీ కూడా అంతఃకరణాన్ని బాగుచేసుకోవటానికే ఏర్పాటు చేసారు.

ఒక విషయం మీరు జ్ఞాపకం ఉంచుకోండి. నేను చెప్పేమాట చివరి రోజున మీకు తెలుస్తుంది, ఇప్పుడు ఎవడికీ తెలియదు. చివరిరోజు అంటే ఏమిటి? మనం ఈ భూమి మీదకు యాత్రకు వచ్చాము. ఇది కూడా యాత్రే. శరీరం విడిచిపెట్టాడు అంటే ఈ భూమి మీదకు వచ్చిన యాత్ర పూర్తి అయిపోయింది. ఆ చివరిరోజున ఏమి తెలుస్తుందో చెప్పమంటారా? మనకు అందరకు ఎంతోకొంత భక్తి ఉంది కాబట్టి అందరం ఇక్కడ సమావేశమయ్యాము. ఇది నిజమే కాని ఎంతవరకు నిజం అంటే ఒక పైసా నిజం. అంటే మనకు భక్తి ఒక పైసా వాటా ఉంది. మనకు భక్తి ఉన్నమాట నిజమే కానీ శరీరం మరణించే రోజున ఆ చివరి ఘడియలో మనకు ఎవరికి భక్తి జ్ఞాపకం రాదు. ఈ పైసా వాటాదారుడిని ఎవడు పిలుస్తాడు. వ్యాపారంలో ఒకడికి 99 పైసలు వాటా ఉంది అనుకోండి, ఇంకొకడికి

ఒక పైసా వాటా ఉంది అనుకోండి, 99 పైసలు వాటా ఉన్న వాడికి విలువ ఉంటుందా? పైసా వాటా ఉన్నవాడికి విలువ ఉంటుందా? మనకు భక్తి ఉంది కాని మనకు ఒక పైసా వాటా మాత్రమే ఉంది. భక్తి కాకుండా ఈ లోకానికి సంబంధించిన విషయాలు, ఆకాంక్షలు, కుతంత్రాలు, కుయుక్తులు మన హృదయంలో భక్తి కంటే బలంగా 99 పైసలు వాటాతో ఉన్నాయి. మనకు భక్తి ఉన్న మాట నిజమే కాని భక్తితో పోల్చుకున్నప్పడు మిగతా ప్రకృతి గుణాలు, మాయకు సంబంధించిన గుణాలు చాలా బలీయంగా ఉన్నాయి. ఆ గుణాలే మరణించే రోజు బయటకు వస్తాయి, దానిని బట్టి మనకు రాబోయేజన్మ నిర్ణయమవుతుంది కాని మనకు ఉన్న భక్తినిబట్టి జన్మ నిర్ణయం కాదు. ఇప్పడు నేను చెప్పిన మాటను మీరు పెడచెవిని పెట్టవచ్చు, లెక్కపెట్టకపోవచ్చు కాని మరణించే రోజున ఈ విషయం మీకు తెలుస్తుంది. ఈ జన్మ పొడుగున మీరు దేనినైతే పోషించారో, దేనినైతే స్మరించారో అదే మరణించే రోజున మీ స్మృతికి వస్తుంది. మీ హృదయంలో ఏ వాసన అయితే బలీయంగా ఉందో అది ఒక్కసారిగా విజృంభించి పొడుచుకొని పొడుచుకొని మీ శిరస్సులోనికి వస్తుంది. ఆ చివరి కోరికనుబట్టి మనకు రాబోయే జన్మ నిర్ణయమవుతుంది. మనకు ఉన్న కొద్దిపాటి భక్తి ఎక్కడో అట్టడుగున ఉంటుంది. మనకు ఉన్న భక్తిని పక్కకు గెంటి మనకు చాలా ప్రీతిపాత్రమైనటువంటి కాంక్ష, మనం జీవితం పొడుగునా మననం చేసిన కాంక్ష విజృంభించి ప్రాణప్రయాణ టైములో మనలను ఆక్రమిస్తుంది. మనకు తెలియకుండానే ఆ వాసన బలీయంగా వస్తుంది. దానిని బట్టి రాబోయే జన్మ నిర్ణయం అవుతుంది. అయితే అది కూడా స్వప్నమే. భవిష్యత్‌లో మనకు అనేక జన్మలు రావచ్చు. అవి కూడా నిజం కాదు. అవి కూడా స్వప్నమే. అందుచేత మీరు భక్తిని రహస్యంగా ఉంచుకొని మీకు ఉన్న ఇతర కోరికలకంటే ఈ భక్తి యొక్క బలం పెరిగేలా చూసుకోవాలి.

మీ మనస్సులోకి ఎటువంటి తలంపులు వస్తున్నాయో చూసుకోండి. మీ గ్రామంలో ఏమి జరుగుతోంది, దేశంలో ఏమి జరుగుతోంది అని తెలుసుకొంటున్నారు కాని మీ మనస్సులోకి ఎటువంటి తలంపులు వస్తున్నాయి అని మీరు చూసుకోకపోతే ఇంక ఆధ్యాత్మిక సాధన ఏముంది? మీ మనస్సును పరిశీలన చేసుకోండి. మనస్సులోనికి ఎటువంటి తలంపులు వస్తున్నాయి అని చూసుకోండి. అప్పడు మీ మనస్సు అంతర్ముఖమవుతుంది. భగవాన్ ఏమంటున్నారు అంటే ఎవరు ఏ మార్గాన్ని ఆచరించినా, ఎవరు ఏ మతంలో ఉన్నా, ఎవరు దేవుడిని ప్రార్థించినప్పటికీ మానవుడికి అహంకారం పోతేనే కాని వాడికి జ్ఞానం కలుగదు. మీరు ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి. మనలో అనేక వాసనలు ఉన్నాయి.

మంచి వాసనలు ఉండవచ్చు, చెడు వాసనలు ఉండవచ్చు. ఈ వాసనలన్నింటికి వేరు అహంకారం, అహంకారాన్ని బట్టే వాసన వస్తోంది, మీకు ఏ వాసన వచ్చినప్పటికీ అహంకారమే మూలం. వాసనాక్షయం అయితే మోక్షం వస్తుంది రైటే, అయితే వాసనాక్షయం ఎలా అవుతుంది. అహంకారం ఉన్నంతకాలం వాసనాక్షయం ఎవడికీ రాదు, మోక్షం ఎవడికీ రాదు. రమణస్వామి ఎక్కువ జ్ఞానం గురించి చెప్పారు. ధర్మ, అర్థ, కామ, మోక్షం ఇవి పురుషార్థాలు. మన పని మనం చక్కగా చేసుకోవటం, సోమరితనం లేకుండా పని చేసుకోవటం ధర్మం. మన శరీరయాత్రకు ఇతరుల మీద ఆధారపడకుండా మన కాళ్లమీద మనం నిలబడి జీవించటం అర్థం. ప్రతీ చిన్న విషయానికి ఎదుటివారి మీద ఆధారపడితే మన మనస్సుకు స్వాతంత్ర్యం పోతుంది. మీ సంసారానికి లోటు లేకుండా వెళ్లటం వరకు సంపాదన అవసరం. కాని ఇప్పుడు మనకు ఎర్నింగే కాని అసలు లెర్నింగ్ లేదు. ధర్మవిరుద్ధం కాకుండా ఇంద్రియాలను సంతృప్తి పరచటం కామం. ఆఖరున మోక్షం చెప్పారు. ఇప్పుడు మనందరం ఏమి చేస్తున్నాము అంటే ధర్మం గురించి ఎంతోకొంత పని చేస్తున్నాము, అర్థం గురించి పనిచేస్తున్నాము, కామం గురించి పని చేస్తున్నాము. ఇంక మనకు తెలియందల్లా మోక్షం. దాని గురించి మనం ఏమీ ప్రయత్నం చేయటం లేదు. మన జీవితంలో మోక్షం గురించి మనం ఏమైనా కాలాన్ని ఖర్చు పెడుతున్నామా? మోక్షం గురించి మనం ఏమి సాధన చేస్తున్నాము అనేది మనం పరిశీలన చేసుకోవాలి. మనం దుఃఖం లేని స్థితిని ఎప్పుడు పొందుతాము? మనకు జన్మరాహిత్యం ఎప్పుడు వస్తుంది? అంటే మోక్షాన్ని పొందినవాడు మాత్రమే దుఃఖంలేని స్థితిని పొందుతాడు, జన్మరాహిత్యం పొందుతాడు. ఎవడైతే మనకు మోక్షానికి దారి చూపిస్తున్నాడో, మోక్షం పొందటానికి మనకు సహాయ సహకారములు అందిస్తున్నాడో వాడే గురువు.

చివరి స్థితి మోక్షం. మోక్షం పొందేవరకు మానవుడిని దుఃఖం విడిచిపెట్టదు, భయం విడిచిపెట్టదు. తాత్కాలికంగా ఇప్పుడు దుఃఖం లేకపోయినా అది నిజం కాదు. మరల కొద్ది రోజులలోనే దుఃఖం వచ్చేస్తుంది. ఎందుచేతనంటే మీ అడ్రసు దానికి తెలుసు కాబట్టి కరెక్టుగా మీ అడ్రసుకు వచ్చేస్తుంది. మనం చేసిన పని మన కూడా ఎలా వస్తుందో ఒక ఉపనిషత్‌లో చక్కగా చెప్పాడు. పది ఆవులను ఇక్కడ కట్టేసి దూడను విడిచిపెడితే, ఆ దూడకు దాని తల్లి ఎవరో తెలుసు సరిగ్గా ఆ తల్లి దగ్గరకే వెళ్లి పాలు కుడుచుకుంటుంది. అలాగే ఇప్పుడు మీరు చేసిన మంచిపని అయినా, చెడ్డపని అయినా తర్వాత మీరు ఏ

జన్మలోనికి వెళ్ళినా సరే, మీరు ఎక్కడ ఏ లోకంలో ఉన్నా సరే అది వచ్చి మిమ్మల్ని అతుక్కొంటుంది అని చెప్పారు. అందుచేత మీలో కర్తృత్వం ఉన్నంతకాలం, నేను చేస్తున్నాను అనే భావన ఉన్నంతకాలం మంచికి మంచి, చెడ్డకు చెడ్డ మీరు అనుభవించి తీరవలసిందే. అందుచేత నేను అనే భావన ఉన్నంతకాలం లోకాలకు వెళ్ళటం, రావటం ఈ ప్రయాణాలు తప్పవు. మానవుడు తనలో ఉన్న అహంకారాన్ని పోగొట్టుకోవాలి. ఈ అహంకారాన్ని ప్రక్కకు పెట్టి జ్ఞానాన్ని సంపాదించాలంటే అది సాధ్యం కాదు. ఎవడైతే తన అహంకారం యొక్క మూలాన్ని అన్వేషిస్తున్నాడో, ఎవడిలో అయితే అహంకారం నశించిందో వాడు జ్ఞాని. రాముడు జ్ఞానం యొక్క మూర్తి, లక్ష్మణుడు వైరాగ్యం యొక్క మూర్తి. రెండూ మనకు వేరు వేరుగా కనిపిస్తున్నప్పటికీ అంతా ఒక్కటే.

మోక్షం మనకు ఎలాగ వస్తుంది అంటే ఏదో పని చెయ్యటం వలన ఎవరికీ మోక్షం రాదు. జ్ఞానం లేకుండా మోక్షం రాదు. మీకు బియ్యం ఉండవచ్చు, సరుకులు ఉండవచ్చు, కుండ ఉండవచ్చు, అన్నీ ఉండవచ్చు, నిప్పలేకపోతే వంట అవ్వదు. అలాగే మీకు పుణ్యం ఉండవచ్చు, ఐశ్వర్యం ఉండవచ్చు, విద్య ఉండవచ్చు, కీర్తి ఉండవచ్చు, ఎన్ని ఉన్నప్పటికీ జ్ఞానం లేకపోతే మటుకు మోక్షం రాదు, రాదు, రాదు. రమణస్వామి యాబది నాలుగు సంవత్సరములు అరుణాచలంలో ఉండి ఆయన జీవితం అంతా కూడా జ్ఞానబోధ చేసారు. ఆయన నిరంతరం జ్ఞానం గురించే చెప్పారు. కృష్ణుడు గీతలో జ్ఞానం గురించి చెప్పాడు, వ్యాసుడు బ్రహ్మసూత్రాలలో జ్ఞానం గురించి చెప్పాడు, పూర్వం మన మహర్షులు చాలామంది జ్ఞానం గురించి చెప్పారు కాని జ్ఞానమార్గాన్ని ఇప్పడు లోకం మర్చిపోయింది కాబట్టి దానిని మరల రమణభగవాన్ పునరుద్ధరణ చేసారు. పాండిత్యం జ్ఞానం అనుకోవద్దు. పాండిత్యం జ్ఞానం కాదు. ఆత్మను తెలుసుకొన్నవాడు, సత్యాన్ని తెలుసుకొన్నవాడు జ్ఞాని. భావన మంచిదే కాని అహంభావన మంచిది కాదు. భావన వద్దని నేను చెప్పటం లేదు, అహంభావన వద్దు అంటున్నాను. ఆసక్తి లేకుండా పని చేస్తే, అహంభావన లేకుండా పని చేస్తే అది పనికాదు, అది పూజ అవుతుంది. పరమేశ్వరుడికి మనలను మనం అర్పించుకోవాలి. మనం పువ్వులు ఇస్తాము, పళ్ళు ఇస్తాము, పటికిబెల్లం పెడతాము, పంచదార ఇవన్నీ పెడదాము కాని మనం నేను, నేను అంటున్నాము కదా ఈ నేనును మటుకు పరమేశ్వరుడికి ఇవ్వము. మన కళ్ళకు కనిపించే వస్తువులు ఇస్తాము కాని ఈ నేనుని మాత్రం పరమేశ్వరుడికి ఇవ్వలేము. మనిషిని రెండు గర్వాలు పీడించేస్తాయి. 1. విత్తగర్వం అంటే నేను ఇంత ధనవంతుడిని అని అనుకొంటూ ఉంటాడు వాడు. ధనం ఉన్నచోట ఆ గర్వం వస్తూ ఉంటుంది. అది

నిగ్రహించుకొన్నవాడు మహాత్ముడు అవుతాడు. 2. విద్యాగర్వం. నేను ఇంత చదువుకొన్నాను అంటాడు. ఆ చదువు అర్థం చేసుకోవటానికి వాడికి ఉపయోగపడటంలేదు కాని గర్వం వస్తోంది. అంటే వాడు సత్యానికి దూరం అవుతున్నాడు. మీరు ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి. మీకు ఏ కారణం వల్ల అయినా గర్వం వస్తోంది అనుకోండి, కారణం ఏదైనా అవ్వవచ్చు రాబోయే జన్మలలో మీరు చీకటిలో పడతారు. మీకు ధనం ఉన్నప్పటికీ, విద్య ఉన్నప్పటికీ, అధికారం ఉన్నప్పటికీ మీకు వినయం వస్తోంది అనుకోండి. మీరు వెలుగు ఉన్న లోకాలకు వెళతారు అంటే మంచి జన్మలు వస్తాయి. మీకు వినయం వస్తూ ఉంటే గొప్ప లోకాలు మీకోసం ఎదురుచూస్తాయి. మీకు గర్వం పెరుగుతూ ఉంటే చీకటి లోకాలు మీకోసం ఎదురుచూస్తాయి. మీకు గర్వం ఉందో, వినయం ఉందో చూసుకోండి. మనందరికీ చావు అంటే భయం. ఎవడైతే పాపరహితుడో, ఎవడైతే పాపాన్ని జయించాడో వాడు మృత్యువును జయిస్తాడు, ఇంక వాడికి మరణం లేదు. పాపం లేనివాడికి మరల దేహం రానే రాదు. అహంకారాన్ని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయండి. నేను అనే తలంపును విడిచిపెట్టటానికి సాధన చెయ్యండి. అప్పడు మీకు జ్ఞానం కలుగుతుంది. అహంకారం పోకపోతే మనం ఎంత ప్రయత్నం చేసినా జ్ఞానం కలుగదు. ఇది నేను చేస్తున్నాను, ఇదంతా నా వల్లే అవుతోంది అనే తలంపును విడిచిపెట్టు. ఎందుచేతనంటే ఆ తలంపే బరువు. నేను చేస్తున్నాను అనే భావనతో ఏ పని చేసినా మంచికి మంచి, చెడ్డకు చెడ్డ తిరిగి మనకు ఎదురు వస్తాయి. నేను అనే తలంపుతో పని చేస్తున్నంతకాలం సంసార చక్రంలో నుండి నువ్వు బయట పడలేవు. అందుచేత ఈ నేను అనే తలంపును ఒక ప్రక్కన పెట్టి నువ్వు పని చెయ్యి. అహంవృత్తిని విడిచిపెట్టి పని చెయ్యి. కృష్ణుడిలో, రాముడిలో, రమణుడిలో ఏ ఆత్మ అయితే ఉందో అది మన హృదయంలోనూ ఉంది. దానికి మరణం లేదు, అది ఎప్పడూ ఉంది. నాలో ఉన్న వస్తువు, మీలో ఉన్న వస్తువు ఒక్కటే. నీ హృదయంలో ఉన్న ఆత్మ నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు నీకంటే నేను గొప్పవాడిని కాదని, అంతా ఒక్కటే అని అప్పడు నీకు తెలుస్తుంది. నిజమైన జ్ఞానికి ఒక్క అజ్ఞాని కనబడడు. ఎందుచేతనంటే తాను ఎవడిని చూసినా ఆత్మనే చూస్తాడు. దేహం లేకుండా లోకాన్ని ఎవరైనా చూసారా? ఈ దేహము, నా కళ్ళకు కనిపిస్తున్న ఈ ప్రపంచం రెండూ దృశ్యాలే. దృశ్యం నిజం కాదు. నీలో ఉన్న ఆత్మను దర్శించు, అప్పడు నువ్వు తరిస్తావు. అప్పడు నువ్వు అరుణాచలంలోనే ఉండనక్కరలేదు. నువ్వు ఎక్కడ ఉన్నప్పటికీ పరమశాంతిని పొందుతావు. ఈ లోకం యొక్క కల్లోలం, ఈలోకం యొక్క అలజడి నిన్ను ముట్టుకోదు.

లోకం యొక్క అశాంతి నిన్ను ముట్టుకోదు. నీలో ఉన్న యదార్థమైన వస్తువును నువ్వు తెలుసుకొన్నప్పుడు నీకు శాంతి వస్తుంది, సుఖం వస్తుంది.

ఒకవేళ మీలో ఎవరికైనా కష్టాలు ఉన్నాయి అనుకోండి. కంగారుపడవద్దు. మీకు వచ్చిన కల ఎలా కరిగిపోతుందో మీ కష్టాలు కూడా అలాగే కరిగిపోతాయి. కష్టాలు ఎప్పుడూ ఇలాగే ఉండిపోతాయి అని మీలో ఎవరూ అనుకోవద్దు. మరల మీకు మంచిరోజులు వస్తాయి. అదీ నిజం అనుకోకండి. మంచి రోజులు కరిగిపోతాయి, చెడ్డ రోజులు కరిగిపోతాయి, మీకు ఉన్న పుణ్యం కరిగిపోతుంది, పాపం కరిగిపోతుంది. ఏదీ నిజం కాదు. మరి అయితే ఏది నిజం? ఆత్మ ఒక్కటే నిజం. అది ఎక్కడో దూరానలేదు. మీ హృదయంలోనే ఉంది. మిమ్మల్ని మీరు బాధపెట్టుకోవద్దు. మిమ్మల్ని మీరు హింస పెట్టుకోవద్దు. ఏ విషయంలోను మీరు కంగారుపడకండి. మిమ్మల్ని మీరు హింసపెట్టుకోవటం కూడా పాపమే. కొంతమంది నిరంతరం వాళ్ల మనస్సును వాళ్ళు పుండు చేసుకొంటూ ఉంటారు. అది కూడా పాపమే. ఎందుచేతనంటే మీరు కూడా జీవుడే కదా! ఎదుటివాళ్ళని దుఃఖపెట్టటమే పాపం కాదు, మిమ్మల్ని మీరు హింస పెట్టుకోవటం, ప్రతీ చిన్న విషయానికి అలజడి పెట్టుకోవటం, కంగారుపడటం అది కూడా పాపమే. ప్రతీ చిన్న విషయానికి మీరు దుఃఖపడుతున్నారు అనుకోండి. అంటే మీకు ఈశ్వరుడి మీద విశ్వాసం లేదు అని గుర్తు. మనం భగవంతుడి మీద భారం వేయటం లేదు. రైల్లో ప్రయాణం చేసేవాడు తన పెట్టె కింద పెడితే రైలుకు బరువు అవుతుందని వాడి నెత్తిమీద పెట్టుకొన్నాడట. అది చూసి వాడు ఎంత తెలివి తక్కువవాడు, ఎంత వెఱ్ఱివాడు అని మనం నవ్వుకొంటున్నాము. వాడు ఎంత తెలివి తక్కువ వాడో మనం అందరం కూడా అంతే తెలివి తక్కువ వాళ్ళము. ఎందుచేతనంటే మన సమస్యలను దేవుడి నెత్తిమీద పెట్టటం లేదు, మన నెత్తిమీద పెట్టుకొంటున్నాము. మన నెత్తిమీద పెట్టుకొన్న మోసేవాడు ఈశ్వరుడే. ఈ లోకం యొక్క బరువునంత మోసేవాడు నీ ఒక్కడి బరువును మోయలేడా? మరి ఎందుకు దుఃఖపడుతున్నారు. మీరు దేనికి భయపడవద్దు. భక్తుడైన వాడు నాశనం కాడు. భక్తుడిని భగవంతుడు రక్షించే తీరతాడు. నా భక్తుడికి దుర్గతి లేదు అని భగవంతుడు వాగ్దానం చేసాడు. మనం అధికారులు చెప్పిన మాటలను నమ్ముతాము, నాయకులు చెప్పేమాటలు నమ్ముతాము కాని భగవంతుడు చెప్పిన మాటలను నమ్మటంలేదు. మీ యోగ క్షేమాలను నేను చూస్తాను అని పరమాత్మ చెప్పాడు. యోగం అంటే లేని దానిని ఇవ్వటం, క్షేమం అంటే ఉన్న దానిని పోకుండా చూడటం. ఇంక మనకు ఏమి కావాలి. అర్జునుడు గొప్ప

వీరుడు. అటువంటి అర్జునుడిని నువ్వు నిమిత్తమాత్రంగా ఉండు, పని అంతా నేనుచేస్తాను అన్నాడు పరమాత్మ. అర్జునుడినే బొమ్మలాగ ఉండమన్నప్పుడు ఇంక మన పరిస్థితి ఏమిటి? మనం నిమిత్తమాత్రంగా ఉండి పని చేస్తే చేయవలసిన పని అంతా ఈశ్వరుడే చేస్తాడు. మన భారం ఎంత ఎక్కువగా ఈశ్వరుడి మీద వేస్తే అంత తొందరగా ఆ పని పూర్తి అవుతుంది. మీరు ఈశ్వరుడి మీద భారం వెయ్యరు అనుకోండి ఆ పని సక్రమంగా అవ్వదు, మీకు దుఃఖం వస్తుంది, మీ ఆరోగ్యం చెడిపోతుంది. మీ గురించి భగవంతుడు మరిచిపోయాడు అని మీరు అనుకోవద్దు. మీరు అనుకొనేవి అన్నీ జరుగుతాయి, కంగారు పడవద్దు. స్వప్రయత్నం కాల పరిపక్వం, ఈశ్వర కటాక్షం ఈ మూడూ సమానంగా వచ్చినప్పుడు ఆ పని పూర్తి అయిపోతుంది. అందుచేత మీరు దేని గురించి ఆందోళన పడవద్దు, ఆవేశపడవద్దు. యాక్షన్, రియాక్షన్, ఎట్రాక్షన్ ఇవి అన్నీ మనస్సుకు సంబంధించిన విషయాలు. ఆత్మకు సంబంధించిన విషయాలు కాదు. మీరు దేని గురించి అయినా ఆందోళన పొందుతున్నారు అనుకోండి, మీకు ఏదైనా దుఃఖం వస్తోంది అనుకోండి, మీకు ఏదైనా భయం వస్తోంది అనుకోండి, ఏదైనా ఆకర్షణ కలుగుతోంది అనుకోండి ఇవన్నీ మనస్సుకు సంబంధించిన లక్షణాలే కాని ఆత్మకు సంబంధించినవి కావు. అనవసరంగా లేనిపోని విషయాలను ఊహించుకోవద్దు.

ఒక చిన్న ఉదాహరణ చెపుతాను జాగ్రత్తగా వినండి. నేను చాలా గౌరవమైన వాడిని, పెద్ద మనిషిని, నేను చాలా మర్యాదస్థుడిని అనుకొంటున్నాను అనుకోండి. మీరు ఏదైనా నన్ను చిన్నమాట అంటే నాకు దుఃఖం వచ్చేస్తుంది. మీ మాటల వలన నాకు దుఃఖం రావటం లేదు. నా గురించి నేను అనుకోవటం వలన నాకు దుఃఖం వస్తోంది. నా గురించి నేను ఊహించుకోకపోతే మీరు ఏదైనా మాట అన్నా నాకు దుఃఖం రాదు. మీరు లేనిపోని విషయాలను అలా ఊహించుకొని దుఃఖానికి పాలుకావద్దు. చిన్నమాట చెపుతాను మీరు ఎవరూ కోపాలు తెచ్చుకోవద్దు. చాలామందికి దేవుడు అంటే ఇష్టం. కొంతమందికి రాముడు అంటే ఇష్టం, కొంతమందికి కృష్ణుడు అంటే ఇష్టం, కొంతమందికి శివుడు అంటే ఇష్టం, కొంతమందికి అమ్మవారు అంటే ఇష్టం. ఇష్టదైవం, ఇష్టమార్గాలు ఇవి అన్నీ అవసరమే కాని ఇవి అన్నీ కూడా మనస్సుకు సంబంధించినవే తప్ప సత్యానికి సంబంధించినవి కావు. నేను నిరంతరం దైవచింతనలోనే ఉంటాను అని చెప్పే భక్తుడికి గాఢనిద్రలో ఉండగా దేవుడి గొడవ ఎందుకు లేదు? గాఢనిద్రలో ఉండగా దేవుడి గొడవ లేకపోయినా నేను ఉన్నానా? లేదా? గాఢనిద్రలో నేను ఉన్నాను, స్వప్నావస్థలో నేను

ఉన్నాను, జాగ్రదవస్థలో నేను ఉన్నాను. నేను లేకపోతే రాత్రి నాకు బాగా నిద్ర పట్టింది అని ఎవరు చెపుతున్నారు? ఈ మూడు అవస్థలలో కామన్‌గా ఉన్న ఈ నేను ఎవరు? దైవచింతన లేనప్పడు కూడా ఈ నేను ఉంది దైవచింతన ఎందుకు అంటే మిగతా చింతనలను బయటకు గెంటి మనస్సును పవిత్రం చేయటానికి మన పెద్దలు ఏర్పాటు చేసారు. ఒక్క విషయం మీరు మర్చిపోవద్దు. సత్పురుషుల సహవాసం విడిచిపెట్టవద్దు. మీ గ్రామంలో ఎవరైనా ఉత్తమపురుషులు ఉంటే, చక్కటి సంస్కారం ఉన్నవాళ్ళు ఉంటే వాళ్ళ స్నేహం విడిచిపెట్టకండి. అదే అన్నీ సమకూరుస్తుంది. అసలు మానవ జన్మ రావటం చాలా కష్టం. వచ్చినప్పడు ఈ దేహాన్ని, మనస్సును సద్వినియోగం చేసుకోవాలి, కాలాన్ని పాడుచేసుకోవద్దు.

నా మనస్సు పరిపరి విధాలుగా పోతుంది ఏమి చేయను స్వామి అని ఒక భక్తుడు భగవాన్‌ను అడిగాడు. నీ మనస్సు పరిపరివిధాలుగా పోతోంది అంటున్నావు ఒకేరకంగా పోయేట్టు చూడు అన్నారు భగవాన్ అంటే ఏకచింతన చేయటం. దైవచింతన ఎందుకు అంటే దైవాన్ని చింతించగా చింతించగా మీకు లోకానికి సంబంధించిన వాసనలు, కామక్రోధాలు వీటి యొక్క బలం తగ్గుతూ ఉంటుంది. ఎప్పడైతే దేహవాసన తగ్గిపోయిందో అంటే దేహబుద్ధి తగ్గుతూ ఉంటే మీకు ఆత్మబుద్ధి పెరుగుతూ ఉంటుంది. ఇప్పడు మనకు అందరకు దేహబుద్ధి ఉంది కాని ఆత్మబుద్ధి లేదు. ఎవరైనా పెద్దలు, ఆత్మ గురించో, ఉపనిషత్‌లు గురించో ఇక్కడ చెపుతున్నారు అనుకోండి. ఆ పది నిమిషాలు మనకు ఎలా ఉంటుంది అంటే ఓహో మనకు జ్ఞానం వచ్చేసింది అనిపిస్తుంది. అలా అనుకోవటం నిజమే. ఎందుచేతనంటే ఆ పదినిమిషాలు మనకు చాలా ప్రశాంతంగా ఉంటుంది. ఆ మీటింగు ఆవరణదాటి బయటకు వచ్చేటప్పటికి ఒక్కసారిగా లోపలఉన్న వాసనలు బయటకు వచ్చి విజృంభిస్తాయి, మనకు దుఃఖం వచ్చేస్తుంది. మనం ఎంత శ్రవణం చేసినా, మననం చేసినా లోపల వాసనలు ఉన్నంతకాలం వాడికి జ్ఞానం కలుగదు, వాడు మోక్షసుఖాన్ని పొందలేడు. ఎవడి మనస్సుతో వాడు పోరాటం చెయ్యాలి. మన భక్తి ఎలా ఉంది అంటే మనం ఎప్పడూ ఇలా ఉండాలి, చావు రాకూడదు, దేవుడు ఉండాలి, మనం అడిగినవి ఆయన ఇస్తూ ఉండాలి, ఇదీ మన భక్తి. నిరంతరం మీ మనస్సు దైవాన్ని చింతిస్తూ ఉండాలి, ఆత్మను స్మరిస్తూ ఉండాలి, అది నిజమైన భక్తి. అడగటం అనేది భక్తి యొక్క లక్షణం కాదు. ఈ మధ్య ఒకరు నాకు 2500 రూపాయలు ఇచ్చి దాయమని చెప్పారు. నేను ఆ డబ్బును పుస్తకాల బీరువాలో పెట్టాను కాని నా మనస్సుకు విక్షేపం వచ్చేస్తోంది. ఆ

డబ్బు ఎవరైనా పట్టుకొనిపోతారేమో అని అప్పుడప్పుడు నా మనస్సు ఆ డబ్బు మీదకు వెళ్లిపోతోంది. ఈ 2500 రూపాయలకే నా మనస్సు వెళ్లిపోతూ ఉంటే ఇంక కోట్లు ఉన్న వాడి మనస్సు ఎలా ఉంటుందో చూడండి. విక్షేపం అంటే విసిరివేయటం. ఆత్మవైపుకు నా మనస్సును పెట్టటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే, డబ్బు ఎక్కడ దాచానో అక్కడకు నా మనస్సు విసిరివేయబడుతోంది. అప్పుడు క్రీస్తు చెప్పిన ఈ మాట జ్ఞాపకం వచ్చింది. ఒంటెను సూది బెజ్జంలోనుండి బయటకు పంపవచ్చు కాని ధనవంతుడిని స్వర్గరాజ్యంలోనికి పంపలేము. మాయ ఎటువంటిదో చూడండి. నా మాయను ఎవరు జయించలేరు అని పరమాత్మ గీతలో చెప్పాడు. అందుచేత మీ మనస్సులో ఏమి జరుగుతోందో చూసుకోండి, మనస్సును పరిశీలన చేసుకోండి. మీకు మోక్షం వచ్చినా మనస్సే కారణం, బంధం వచ్చినా మనస్సే కారణం.

మనం అందరం శారీరకఆరోగ్యానికి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నాము కానీ మానసిక ఆరోగ్యానికి ప్రాముఖ్యత ఇవ్వటంలేదు. మనం ఏమి చేస్తాము అంటే మనకు సంతోషం వస్తే మనమే అనుభవిస్తాము, మనకు దుఃఖం వస్తే దానిని అందరికీ పంచిపెట్టాలి అనుకొంటాము. మన ఆస్తులు పంచుకొనేవాళ్ళు ఉన్నారు కాని మన దుఃఖాన్ని ఎవరూ పంచుకోరు? ఒక్క జ్ఞాని తప్పించి మన దుఃఖాన్ని పంచుకొనేవాడు ఎవడూ లేడు. స్వామివివేకానంద ఏమి చెప్పారు అంటే నీకు దుఃఖంగా ఉంటే ఇంట్లో తలుపులు వేసుకొని కూర్చో, అంతేగాని బయటకు వెళ్లి నీ దుఃఖాన్ని ఇతరులకు పంచిపెట్టకు. మీ మనస్సులో ఏమి జరుగుతోందో చూసుకోండి. లుక్ విత్ ఇన్. మీరు లోపలకు చూడండి. మనం చిన్నప్పటినుండి బయటకు చూడటానికి అలవాటు పడ్డాము కాని లోపల ఏమి జరుగుతోందో చూసుకోవటానికి అలవాటు పడలేదు. శ్రవణం చెయ్యాలి, శ్రవణం మానకూడదు. అసలు తినాలి కదా అరగాలి అంటే. అసలు ఏమి తినకుండా అరగటంలేదు అంటే ఎలాగ? శ్రద్ధగా శ్రవణం చెయ్యాలి. శ్రవణం చేసిన దానిలో కొన్ని విషయాలు అర్థం అవ్వవచ్చు, కొన్ని విషయాలు అర్థం కాకపోవచ్చు. శ్రవణం మానకూడదు. మీరు ఎంతవరకు అర్థం చేసుకోగలరో అంతవరకు అర్థమవుతుంది. అయితే అనుభవం చాలా ముఖ్యం. ఆత్మ మన మనస్సుకు, ఇంద్రియాలకు అందకపోవచ్చు కాని ఆత్మ మన అనుభవానికి అందుతుంది. ఏ లాభం పొందిన తరువాత దానితో సమానమైనది కాని, దానికి మించినది కాని లేదని నీకు తెలుస్తుందో అట్టిది ఆత్మలాభం. ఆత్మానుభవం పొందినవాడు, ఆత్మలాభం పొందినవాడికి ఎంత దుఃఖం వచ్చినా వాడు ఏమీ చలించడు, వాడిని మరణం ముట్టుకోదు. ఆత్మ ఎక్కడ

ఉంది అంటే ఆత్మ ఇక్కడే ఉంది, నీ హృదయంలోనే ప్రకాశిస్తోంది. మనపై కరుణ చూపించటం కోసం మన కోసం ఎదురుచూస్తోంది. మీరు పూర్ణసుఖం పొందాలి అంటే ఆత్మానుభవం పొందవలసిందే. ఆత్మతో పోల్చటానికి ఈ లోకంలోగాని, పరలోకంలోగాని, అసలు ప్రకృతిలో వస్తువే లేదు. మీకు ధనం ఉంది అనుకోండి, ఖర్చు చేస్తూ ఉంటే అది తరిగిపోతుంది, కాని ఆత్మశాంతి అటువంటిది కాదు, దానిని మీరు అనుభవించేకొలది అది పెరుగుతుంది.

ఒక చిన్న విషయం మీరు దృష్టిలో పెట్టుకోండి. నేను మీకు నమస్కారం పెడితే మీ దేహానికే వర్తిస్తుంది. మీరు నాకు నమస్కారం పెడితే నా దేహానికి వర్తిస్తుంది. కాని జ్ఞానికి నమస్కారం పెడితే ఆ దేహానికి పెడుతున్నాము అని మనం అనుకోవచ్చు కానీ ఆ నమస్కారం ఆత్మకు వెళుతుంది. ఎందుచేతనంటే ఆయన ఆత్మ అయి ఉన్నాడు కాబట్టి. రమణస్వామి ఒకసారి అన్నారు నేను కొంతకాలం ఆ రాళ్ళ గుట్టమీద కూర్చున్నాను, ఇప్పుడు సోఫాలో కూర్చొంటున్నాను, నా ప్రారబ్ధాన్ని బట్టి అప్పుడు అలా కూర్చోవలసి వచ్చింది, ఇప్పుడు ఇలా కూర్చోవలసి వచ్చింది. అలాగే మీ దేహప్రారబ్దాన్ని బట్టి కష్టం రావచ్చు, సుఖం రావచ్చు. అదీ స్వప్నమే, ఇదీ స్వప్నమే. మనకు వచ్చే కష్టాలు జ్ఞానికీ వస్తాయి. కాని అవి కష్టాల కింద ఆయనకు కనిపించవు. జ్ఞాని దేహానికి వచ్చే మృత్యువు మృత్యువు కింద ఆయనకు కనబడదు. ఎందుచేతనంటే ఆయన దేహం కాదు. మన దేహాన్ని కట్టెలలో కాల్చకముందే మన మనస్సు కాలిపోవాలి, వాసనలు కాలిపోవాలి. దేహం కాలకముందే ఎవడి అహంకారం అయితే కాలిపోయిందో, ఎవడి వాసనలు అయితే సమూలంగా కాలిపోయాయో వాడు జ్ఞాని అవుతాడు.

జ్ఞానాన్ని సంపాదించాలి అనే అపేక్ష కలగాలి అంటే ఆ జన్మలో గాని, పూర్వజన్మలోగాని ఏవో మంచి పనులు చేసి ఉండాలి. పూర్వజన్మలలో సత్కర్మ చేసి ఉండకపోతే మీకు జ్ఞానం పట్ల అపేక్ష కలుగదు. మనకు ఉన్న ధనం కాని, మనకు ఉన్న తెలివికాని మనకు పుణ్యాన్ని సంపాదించిపెట్టాలి. మనకు ఉన్న ధనాన్ని, తెలివిని ఎంతోకొంత సమాజంకోసం ఉపయోగించాలి. అంతేగాని వాటి ద్వారా సమాజానికి అరిష్టం తెచ్చే పనులు చేయకూడదు. నాకు తెలివితేటలు ఉన్నాయి అనుకోండి, నా తెలివితేటలు నాకు ఉపయోగపడాలి, ఎదుటి మనిషికి ఉపయోగపడాలి, సమాజానికి ఉపయోగపడాలి. ఎవడైతే తనకున్న ధనాన్ని, తెలివిని సమాజంకోసం కొంత ఖర్చుపెడుతున్నాడో వాడు పుణ్యకర్మలు చేసినట్లు లెక్క. అటువంటి

పుణ్య కర్మలు బహుజన్మలు చేయగా చేయగా వాడికి జ్ఞానం పట్ల ఆసక్తి కలుగుతుంది అని పరమాత్మ చెప్పాడు. ఎవడైతే తనకున్న ధనాన్ని సమాజంకోసం ఖర్చుపెట్టకుండా కేవలం నేను ధనవంతుడిని అని చెప్పకోవటం వలన గర్వం పెరుగుతుంది, అదే అతని పతనానికి కారణం అవుతుంది.

సిద్ధంగా ఉన్న వస్తువును తెలుసుకొన్నవాడే సిద్ధిని పొందుతాడు. అది మన హృదయంలోనే ఉంది. ఏదో ఒక పని చేయటం వల్లకాని, ఏదో మంత్రం జపించటం వల్లగాని అది రాదు. అంతఃకరణంలో ఉన్న దోషాలను పోగొట్టటానికే పూజ, జపం, ధ్యానం ఇవి అన్నీ పెట్టారు. అంతేగాని ఈ మంత్రం, పూజ ఇవి ఏమీ ఆత్మను సాధించి పెట్టవు. ఒక్క విషయం మీరు గుర్తు పెట్టుకోండి. ఈశ్వరుడిపట్ల మీకు ఉన్న భక్తి నిజమైతే ఏ పని ఎప్పడు చేయాలి, ఎలా చెయ్యాలి ఆ గైడెన్స్ అంతా నీలోపల నుండే వస్తుంది. ఎందుచేతనంటే మార్గదర్శి ఇక్కడే నీ లోపలే ఉన్నాడు. ఆయనకు తెలియకుండా మనం ఒక్కపని కూడా చేయలేము. నేను ఎవడను అనే పుస్తకంలో రమణస్వామి ఏమి చెప్పారు అంటే ఎదుటివాడికి ఏదైనా సహాయం చేస్తే అది తనకు తాను సహాయం చేసుకున్నట్లే. ఈ సంగతి తెలిస్తే సహాయం చెయ్యనివాడు ఎవడు? ఎదుటివాడికి చేసే సహాయం తిరిగి తనకే వచ్చేస్తుంది అన్న సంగతి వీడికి తెలిస్తే, అది వీడి బుర్రకు అందితే సహాయం చెయ్యకుండా ఎవడు ఉండగలడు? మానసికస్థాయిలో కొంతమంది ముందు ఉండవచ్చు, కొంతమంది వెనుక ఉండవచ్చు. కానీ ఆత్మ మటుకు అందరి హృదయాలలో సమానంగానే ఉంది. ఆత్మ ఎంత సమానంగా ఉందో మన మనస్సును కూడా అంత సమానస్థాయికి తీసుకొని వస్తే మన మనస్సులో ఉన్న బలహీనతలు అన్నీ రాలిపోతాయి. సమత్వ దృష్టి వల్ల మనం యోగి అవుతాము. మనం బయట ఉన్న మంటలను ఆర్పుతున్నాము కాని మన గుండెల్లో ఉన్న రాగద్వేషాలను ఆర్పుకోవాలి. ఈ రాగద్వేషాలను ఎంతకాలం అయితే ఆర్పలేమో అంతకాలం మనస్సు లోపలకు ప్రవేశించదు. రాగద్వేషాలు మనస్సును బయటకు లాగేస్తూ ఉంటాయి. రాగద్వేషాలను ఎప్పడైతే తొలగించుకొన్నామో అప్పడు మనస్సు హృదయాకారం చెందుతుంది. మనందరకు ధనం సంపాదించాలని ఉంది. ఇంద్రియాలతో భోగం అనుభవించాలంటే ధనం ఉండాలి. భోగం వలన మనకు సుఖం వస్తుంది, శాంతి వస్తుంది అని మన ఉద్దేశం. కాని భోగాల వలన చివరకు మనకు దుఃఖం మిగులుతుంది. అదే పరమాత్మ చెప్పాడు. మొదట ఏదైతే మీకు విషంకింద కనిపిస్తుందో చివరికి అది అమృతం కింద వస్తుంది. మొదట ఏదైతే మీకు అమృతం కింద ఉందో అదే చివరకు విషం కింద

పరిణమిస్తుంది. ఇంద్రియసుఖాలు మొదట అమృతంకింద ఉంటాయి చివరకు విషాన్ని ఇస్తాయి. ఆత్మసుఖం మొదట మీకు కష్టంగా అనిపించినా అది అమృతాన్ని ఇస్తుంది. ఇంద్రియాల ద్వారా మనం అనుభవించిన భోగాలు ఇక్కడే కరిగిపోతాయి, మీ ధనం ఇక్కడే కరిగిపోతుంది. కాని వాటి తాలుక వాసనలు మన హృదయంలో దాగి ఉంటాయి. పరమలోభివాడు తన డబ్బును ఎలా దాచుకుంటాడో అలాగ మనం చేసిన పనుల తాలుక వాసనలను పరమేశ్వరుడు మన హృదయంలో జాగ్రత్తపెట్టి ఉంచుతాడు. ఎందుచేతనంటే వాటిని మనచేత అనుభవింప చేయటం కోసం జాగ్రత్తపెట్టి ఉంచుతాడు. అందుచేత మన మనస్సులోకి వచ్చే తలంపుల విషయంలో, మనం చేత్తో చేసే పనుల విషయంలో, మాట్లాడే మాటల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మన మాటలో, చూపులో కరుణ ఉండాలి. దయలేనివాడికి ఈ విద్య అబ్బదు.

జీవలక్షణాలు ఉన్నంతకాలం ఎవడికీ జ్ఞానం కలుగదు. మీరు స్త్రీలా, పురుషులా అని కాదు, మీరు ఎవరికి భక్తులు అనికాదు, మీరు ఏ మతస్థులు అని కాదు మీలో జీవలక్షణాలు ఉన్నంతకాలం మీకు జ్ఞానం కలుగదు. జ్ఞానం కావాలంటే జీవలక్షణాలను విడిచిపెట్టాలి. జీవలక్షణాలను ఎవడైతే విడిచిపెట్టాడో వాడికి శివదర్శనం అవుతుంది. మీరు శివస్మరణ చేయండి, రామస్మరణ చేయండి. నాకు భక్తిని ప్రసాదించు, జ్ఞానాన్ని ప్రసాదించు అని భగవంతుడిని ప్రార్థించండి. ఈలోకానికి సంబంధించిన విషయాలు మాత్రం ఏమీ అడుగవద్దు. మీకు ఎప్పుడు ఏది అవసరమో ఆయనకు తెలుసు. మీరు అడగకపోతే అన్నీ ఆయనే సమకూరుస్తాడు. మీరు దేనికోసం దుఃఖపడవద్దు. మీరు బరువులు మోయవద్దు. మీ బరువును ఈశ్వరుని మీద పెట్టండి. అంతా ఆయనే చూసుకుంటాడు. మీరు ఆధ్యాత్మికంగా అభివృద్ధి పొందాలంటే మీ భారాన్ని ఆయన మీద వెయ్యండి. మీకు మేలు చేకూరుస్తాడు. ఈశ్వరానుగ్రహం వలన అన్నీ నెరవేరతాయి. అందుచేత ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టకండి. ఎదుటివారి మీద ఆధారపడకుండా మీ పనులు చక్కగా చేసుకుంటూ భగవంతుని స్మరణలో మీ మనస్సును నానబెట్టడానికి ప్రయత్నం చేయండి. మీ ఇల్లు ఎలాగ శుద్ధి చేసుకుంటున్నారో, మీ దేహాన్ని ఎలా శుద్ధి చేసుకుంటున్నారో అలా మీ మనస్సును శుద్ధి చేసుకోండి. మీ మనస్సు బాగుపడితే అన్నీ బాగుపడతాయి. మీకు శాంతి ఉంటే అన్నీ ఉన్నట్లే, శాంతి లేనివాడికి సుఖం లేదు. అందుచేత శాంతిని పోగొట్టుకోవద్దు. శాంతిని పోగొట్టుకుంటే పాపంతో పోరాడలేరు. భక్తిని సంపాదించుకోండి. భక్తి వలన ముక్తి వస్తుంది.

## శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

| | | |
|---|---|---|
| ఏప్రిల్ | 6 | ఉగాది - మధ్యాహ్నం గం॥ 2-00లకు భక్తులచే ప్రవచనములు |
| ఏప్రిల్ | 13 | శ్రీరామ నవమి - మధ్యాహ్నం గం॥ 1-00లకు అమలాపురం మాష్టారి ప్రవచనం |

SRI RAMANA KSHETRAM A/c. No. **51010100649727 3**
**Corporation Bank, Palakol Branch,** IFSC Code : **CORP0001613**

**ఆంధ్ర ఆశ్రమము, తిరువణ్ణామలై** ఫోన్ : 04175-236174
**For Accomodation : Office Incharge Balaraju 08297672348, 9849124502**

# మన స్వరూపమే మోక్షం

మన సహజస్థితి అనగా స్వరూప సచ్చిదానంద స్థితి మనస్సుకి, బుద్ధికి, మాటకు అందదు. "మోక్షము నీ స్వరూపంగానే ఉంది" అంటారు భగవాన్ శ్రీరమణమహర్షి! అట్టి అమృతస్థితి, దేహేంద్రియ మనోబుద్ధులకు, దృశ్య ప్రపంచానికి ఆధారముగా ఉండి, వాటికి అతీతమైన అద్వైతస్థితి, అదే నేనుకి అర్థం. అది మన అంతరానికి అనగా హృదయానికి సంబంధించినది. మోక్షము, సాధకుడిచేత సాధన ద్వారా సాధింపబడే దృశ్యవస్తువు కాదు. కాబట్టి కేవల సత్యాన్ని అనుభవైకవేద్యం చేసుకొని, 'తాను' సచ్చిదానంద స్వరూపుడుగా ఉండడమే! సాధన గమ్యం. సత్యము 'తాను'గా అనుభవైకవేద్యం అయితే, అసత్యము నుండి అనగా అవిద్యనుండి విడుదల పొందుతాము, అది ఏదో అద్భుతస్థితిని సాధించడము కాదు. ఆత్మ విశేషము కాదు, నిర్విశేషము అది సహజమైనది, సామాన్యమైనది. మన స్వరూపము సచ్చిదానందమే అయినప్పటికి, మనము దుఃఖించడానికి కారణం మన దేహాత్మబుద్ధే! అట్టి దేహాత్మబుద్ధినుండి విడుదల పొంది వాస్తవంగా తాను ఎవరో? అనుభవైకవేద్యం కావాలంటే ఆత్మజ్ఞానాన్ని బోధించి, స్వరూపంలోకి మేల్కొలిపే గురువు ఆవశ్యకం. ధాన్యపుగింజను ఆవరించియున్న పొట్టును ఏవిధంగా అయితే తీసివేస్తామో, అదేవిధంగా గురువు స్వరూప సత్యాన్ని ఆవరించియున్న అవిద్యను నిర్మూలిస్తారు. ఆధ్యాత్మిక రహస్యమంతా కేవలం ఉన్న దానిని ఉన్నట్లు అర్థం చేసుకుని, భ్రాంతి నుండి విడుదల పొంది, సన్మార్గములో జీవిస్తూ, దేహము జీవించియుండగానే దేహాత్మబుద్ధినుండి విడుదలపొందుట ద్వారా తాను 'అమృతుడు' అవడం. అందులకు గురుకృప నిరంతరం ఉండనే ఉంది.

**ఓం తత్ సత్**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# గుణసౌందర్యం లేకపోతే గురువు ఆత్మానుభవమునకు సహకరించరు

మనం ప్రకృతి రూపాల్లో చూచేందుకు ఏమి దొరుకుతుంది. ఆనందాన్ని వెదుకుతాము, విషాదాన్ని పొందుతాము. అది జీవితమని ఎలా అనగలం, అది పీడకల, మూర్ఛరోగం, నిజానికి పెళ్లి అనేది పాతచింతకాయ పచ్చడి. అది చిన్నపిల్లల ఆటలాంటిది. అది సుదీర్ఘమైన బాధాసంకెళ్ళు అది తాత్కాలికం అందులో జీవనం లేదు. మృత్యువుతో ఆ దీర్ఘవ్యాధి ముగుస్తుంది. శరీరరమనే మట్టి ప్రమిదలో వెలిగే జీవనజ్యోతిని ఎప్పడు అనుభవంలోకి వస్తుందో అప్పడే జీవనసాఫల్యం పొంది ఆనందమయులు, ప్రేమమయులు అవతామని గురుదయవల్ల అవగాహన అవుతుంది. శ్రీనాన్నగారు "అడివిలో అప్పడే పుట్టిన మేకపిల్లని ఒంటరిగా ఉంటే కుక్కలు, నక్కలు, తోడేళ్ళు పీక్కుతిని చంపేస్తాయి. అలాగే కొందరికి అయోగ్యమైన సంతానం సంప్రాప్తమైతే మాకు ఆ అవసరం, ఈ అవసరం ఉందని తల్లిదండ్రులను పీక్కుని చంపేస్తారు" అన్నారు. దైవప్రేమలో ఉండటానికి వేదనలు అనుభవించటం మంచిది. కొలిమిలో పడ్డ బంగారం కాలేది అన్యంపోయి వెలగటానికే అలాగే క్లేశాలు మనలను మరింత ఎరుక ఉండటానికి అవకాశం ఉంటుంది. అది గొప్ప సవాలు. దాన్ని అంగీకరించాలి. లేకపోతే వారు వెన్నెముకలేని వారిగా ఉండిపోతారు. "పరిశుభ్రమైన అద్దంముందు మన ప్రతిబింబము ఎంత స్పష్టంగా కనబడుతుంది! గుణదోషంలేని నిర్మలబుద్ధియందు అంత స్పష్టంగా ఆత్మదర్శనమౌతుంది" అని శాస్త్రం చెబుతుంది. సోక్రటీస్ బాహ్యసౌంరద్యంలో చాలా వికారంగా ఉండేవాడు. ఆతని అంతఃసౌందర్యం కోసం దైవాన్ని ప్రార్ధించాడు. సద్భావన కలిగి ఉండటమే అంతఃసౌందర్యం. సద్గురుని చేరి "ఓ ప్రభూ నాలో గుణసౌందర్య లేసమైనా లేవు. నేను సత్యాన్ని ఎలా కోరగలను. మంచి సద్గోష్టి లేదు. అజ్ఞానిని, నేను మీ పాదాలను చేరేలా నన్ను ఆశీర్వదించండి. మీరు నన్ను అభిమానించకపోతే నాగతి ఏమి కాను. నన్ను సంసయాలు బాధిస్తున్నాయి. భ్రాంతులు నన్ను వీడటంలేదు. నా అహంకారం పోయినప్పడే నేను మీకు ప్రేమపాత్రుడనైపోయి మీలో లీనమైపోతాను. జన్మజన్మలకు మీకు దూరమైనాను. ఇప్పడు నా చెయ్యి పట్టుకొని వీడకండి తండ్రీ" అని ఆర్ద్రతతో ఆక్రోశించితే చెడుగుణాలు చెల్లాచెదురైపోతాయి. మీరు నాతో ఉంటేనే నేను అన్నీ సాధిస్తాను. మీరు నా మూలనాధుడవు. మీరు నా దగ్గరకు వస్తేనా శాంతి. ధన్యత్నఉ పొందుతాను. మీ అనుగ్రహం ఉంటే సంసారసాగరాన్ని దాటగలను. మీరు సత్యమైన శృంగారమూర్తిగా కనిపిస్తున్నారు. సమస్తకళ్యాణ గుణాలు మీలో ఉన్నాయి. బహుశా నా ఇచ్ఛానుసారమే కాబోలు భయంకరంగా కనబడే చావుపుట్టుకల జంఝాటంలో నన్ను తిప్పతున్నారు. తండ్రి మీకు మీరే సాటి నేను మీకు శరణుజొచ్చాను. నేను మిమ్ములను ఏమీ అడగను. నేను మీకోసం తపించిపోతున్నాను అనిమాత్రం అనగలను చివరకు మీరు నిరంతరం బ్రహ్మస్వరూపంలో ఉంటారు. మీ ధర్మమే నాకు తగులుకొటుందని ఆశ. నా ఆశను నిరాశ చేయకండి. త్రండ్రి తండ్రి తండ్రి ఇదే నా ప్రార్ధన. అనాలి.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**